
andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

కామారెడ్డి
జిల్లా వార్తలు

5

గురువారం 18 సెప్టెంబరు 2025





- సుస్థిర పరిపాలనతో ప్రభుత్వం కొనసాగుతుంది
- సర్వమతాలను సమానంగా ఆదరిస్తు శాంతి సామరా స్యాలకు ప్రతీకగా నిలిచింది
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాడు
- ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటీ నెరవేరుస్తున్నాం
- తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి
- కలెక్టరేట్‌లో ప్రజా పాలన దినోత్సవానికి హాజరై జెండా ఆవిష్కరణ

మాట్లాడుతున్న కోదండరెడ్డి



అమరవీరుల స్థూపం వద్ద నివాళ్లు అర్పిస్తున్న కోదండరెడ్డి



సాయుధ పోరాటంతోనే.. ఆంక్షలు తొలగాయి



కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరిస్తున్న తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాటంతోనే వెట్టిచాకిరి, భావ వ్యక్తీకరణపై ఆంక్షలు, మాతృభాష అణిచివేత, మతపరమైన నిరంకుశ ధోరణులు తొలగి హైదరాబాద్ సంస్థానం రాజరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థలోకి మారిందని తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. బుధవారం కామారెడ్డి కలెక్టరేట్‌లో ప్రజాపాలన దినోత్సవానికి హాజరై జాతీయ జెండా ఆవిష్కరించారు. అంతకుముందు కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్‌తో కలిసి హౌజింగ్‌బోర్డు కాలనీలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళ్లు అర్పించారు. అనంతరం కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సుస్థిర ప్రజాపాలనతో సంక్షేమాన్ని పంచుతూ సర్వమతాలను సమానంగా ఆదరిస్తు శాంతి సామరస్యాలకు ప్రతీకగా నిలిచిందన్నారు. గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం దిశగా ఆదర్శవంతమైన పల్లెలు, పట్టణాలతో ప్రబవిల్లుచున్నదని తెలిపారు. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షిస్తూ పరిశ్రమలకు స్వర్గధామంగా పేరొందిందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుందన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు అభయహస్తం హామీలను ఒక్కొక్కటిగా అధికారంలోకి వచ్చిన 48 గంటల నుంచి అమలు చేయడం ప్రారంభించిందని తెలిపారు. ఇందిరమ్మ రైతుభరోసా సహాయాన్ని ప్రస్తుత వానాకాలంలో 3లక్షల 3వేల 568 మంది రైతుల ఖాతాలలో రూ.305 కోట్ల 98లక్షలను జమ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం జిల్లాలో 1లక్ష 96వేల 554 మంది రైతులకు బీమా కల్పించిందని తెలిపారు. జిల్లాలో కొత్తగా 16,152 కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేయడంతో పాటు 49వేల 971 మంది కుటుంబ సభ్యులను వారికి సంబంధించిన రేషన్‌కార్డులలో జత చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 2లక్షల 83వేల 253 రేషన్‌కార్డుదారులకు సెప్టెంబరు నెలకు గాను 6 వేల 159 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. రూ.500 గ్యాస్ సిలిండర్ సరఫరా పథకం కింద జిల్లాలో ఇప్పటి వరకు 1లక్ష 50 వేల 131 మంది వినియోగదారులకు 5లక్షల 58వేల 981 గ్యాస్ సిలిండర్‌లు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. దీనికి గాను ప్రభుత్వం రూ.16 కోట్ల 5లక్షల సబ్సిడీ అందించిందని తెలిపారు. చేయూత పథకం కింద అన్ని రకాల పింఛన్లు కలిపి 1లక్ష 62వేల మంది పింఛన్ లబ్ధిదారులకు ప్రతీనెల 36 కోట్ల 12 లక్షలు పంపిణీ చేయడం జరుగుతుందని (మిగతా 8వ పేజీలో)





కార్యక్రమానికి హాజరైన అధికారులు, ప్రజలు



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న వేం నరేందర్‌రెడ్డి

అభివృద్ధిలో అగ్రగామి

- ప్రజాసమస్యల పరిష్కారంలో ముందున్నాం
- ప్రజాపాలనలో అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు
- నిజామాబాద్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి

నిజామాబాద్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాల ప్రగతిని ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి వివరించారు. బుధవారం నిజామాబాద్‌లోని కలెక్టరేట్‌లో తెలంగాణ పరిపాలన దినోత్సవానికి ముఖ్య అతిథిగా వచ్చి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాట ఫలితంగా అప్పటి వరకు పల్లెల్లో నెలకొన్న వెట్టిచాకిరి, భావ వ్యక్తీకరణపై ఆంక్షలు, మాతృభాషా అణచివేత, మతపరమైన నిరంకుశ ధోరణులు తొలగి 17 సెప్టెంబరు 1948న హైదరాబాద్ సంస్థానం రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థలోకి మారిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన మార్పు వల్ల రాష్ట్రం దేశంలోనే కీర్తిని సాధిస్తుందని సుస్థిర ప్రజాపాలనతో సంక్షేమాన్ని పంచుతూ సర్వమతాలను సమదరిస్తూ శాంతి సామరస్యాలకు ప్రతీకగా నిలిచిందన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం దిశగా ఆదర్శవంతమైన పల్లెలు, పట్టణాలతో ప్రభవిల్లుతోందన్నారు. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షిస్తూ పరిశ్రమలకు స్వర్గధామంగా రాష్ట్రం నిలిచిందన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసేందుకు ఒక్కొక్కటిగా అధికారంలోకి వచ్చిన 48 గంటల నుంచే అభయహస్తం హామీలను నెరవేరుస్తున్నామని, ఇందిరమ్మ గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తు స్వీకరించి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు.ప్రజాపాలన ద్వారా ప్రజా సమస్యలను నేరుగా విని వాటిని పరిష్కరించడం కోసం గ్రామస్థాయిలోకి అధికారులను పంపించామన్నారు.

ఇందిర మహిళా శక్తి పాట ఆవిష్కరణ

రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు ఇస్తున్న ప్రాధాన్యత, మహిళా శక్తి పథకంపై డీఆర్‌డీఏ కల్చరల్ కోఆర్డినేటర్ అష్ట గంగాధర్ రచించిన పాటను రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య, రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హుం దాన్, నుడా చైర్మన్ కేశవేణు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చేపల విక్రయవాహనం ప్రారంభిస్తున్న కలెక్టర్

సంచార చేపల విక్రయ వాహనం ప్రారంభం

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సంచార చేపల విక్రయ వాహనాలను బుధవారం కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకొండ మండలం అంబారిపేట గ్రామానికి చెందిన రంగోల్ స్వప్న, నిజాంసాగర్ మండలానికి చెందిన ఇర్ఫానా బేగం రూ.10లక్షల విలువ గల రెండు వాహనాలు అందించామని తెలిపారు. ఇందులో రూ.6లక్షల సబ్సిడీ వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ సురేందర్, ఏడీఆర్‌డీఏ విజయలక్ష్మీ, డీపీఎం రాజయ్య, సురేష్, జిల్లా సమైక్య అధ్యక్షురాలు పుష్పరాణి, మండల సమైక్య అధ్యక్షురాలు భూలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాలు సకాలంలో మంజూరు చేయాలి

అర్హులైన అందరికీ సకాలంలో పంట రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ బ్యాంకర్లకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పోడు భూములకు కూడా పంట రుణాలను అందించాలని వరదల వల్ల దెబ్బతిన్న ఎంఎస్ఎంఈ యూనిట్లకు రుణాలు మంజూరు చేయాలని సూచించారు. అనంతరం డీఎఫ్ఎస్ ప్రవేశపెట్టిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని వచ్చే 2 వరకు జరిగే క్యాంపెన్ ఆధ్వర్యంలో చేపట్టి పోస్టర్‌ను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్‌నాయక్, డీఆర్‌డీఏ పీడీ సురేందర్, ఆర్‌బీఐ ఏజీఎం రాములు, నాబార్డ్ డీడీఎం ప్రవీణ్, బ్యాంకర్లు, జిల్లా అధికారులు పాల్గొనడం జరిగిందని తెలిపారు.

సీఐపై జాతీయ ఎస్సీ కమిషన్ సీరియస్?

- 30 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఏడీజీపీ, ఎస్పీకి నోటీసులు జారీ

కామారెడ్డి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఓ సీఐపై జాతీయ ఎస్సీ కమిషన్ సీరియస్ అయింది. భూ కబ్జాలు, అక్రమ నిర్మాణాలు, చెరువుల ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదులను సదరు సీఐ నిర్లక్ష్యం చేసి ప్రభావశీలుల పక్షాన ఉంటున్నాడని తమ పట్ల అవమానకరంగా ప్రవర్తించినట్లు ఓ బాధితుడు ఈనెల 8న జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. స్పందించిన కమిషన్ ఏడీజీపీ, ఎస్పీలకు నోటీసులు జారీ చేసింది. పూర్తిస్థాయి విచారణ జరిపి 30 రోజులలోపు వివరణ ఇవ్వాలని లేదంటే తన అధికారాలను ఉపయోగించి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసింది. అయితే గతంలోనూ బాధితులు నేరుగా సీఎం దృష్టికి కూడా తమకు జరిగిన అన్యాయాన్ని తీసుకెళ్లినట్లు సమాచారం.

రేసు కుక్కల దాడిలో తొమ్మిది గొర్రెల మృతి



గొర్రెలను తింటున్న రేసు కుక్కలు

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబరు 17: ఎల్లారెడ్డి మండల పరిధిలోని ఆజామాబాద్, తిమ్మారెడ్డి గ్రామాల సరిహద్దు అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లిన గొర్రెల మందపై రేసు కుక్కలు దాడి చేయగా తొమ్మిది గొర్రెలు మృతి చెందినట్లు స్థానికులు బుధవారం తెలిపారు. ఈ మూగజీవాలు తిమ్మారెడ్డి గ్రామ పరిధిలోని కట్టకింది తండాకు చెందిన ఓ వ్యక్తికి చెందినవని సమాచారం. ఈ ఘటనతో చుట్టుపక్కల పరిసర గ్రామాల పశువుల కాపర్లు, పంట పొలాలకు వెళ్లే రైతులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నెల రోజులుగా పొంగి పొర్లుతున్న పోచారం

- ప్రాజెక్టులో కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
- బుధవారం సాయంత్రానికి ప్రాజెక్టులోకి వస్తున్న 3,854 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నాగిరెడ్డిపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పోచారం ప్రాజెక్టు నెల రోజులుగా పొంగి పొర్లుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పోచారం ప్రాజెక్టు ఆగస్టు 16న పూర్తిస్థాయి నీటి మట్టంతో 20.5 అడుగులు, 1.820 టీఎంసీలు నిండి పొంగి పొర్లుతోంది. ప్రాజెక్టులోకి వస్తున్న వరద నీరు మొత్తం ప్రాజెక్టు కట్టపై నుంచి అలుగు పారుతూ దిగువకు మంజీరా నది ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వెళుతోంది. నెల రోజులుగా పోచారం ప్రాజెక్టు కట్టపై నుంచి అలుగు పారుతునే ఉంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలోని లింగంపేట, గాంధారి, తాడ్వాయి తదితర మండలాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా పోచారం ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతునే ఉంది. మంగళవారం ప్రాజెక్టుగా ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాల కారణంగా పోచారం ప్రాజెక్టులోకి బుధవారం ఉదయం 5,207 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, సాయంత్రానికి 3,854 క్యూసెక్కులకు తగ్గింది. ప్రాజెక్టులోకి వస్తున్న ఇన్‌ఫ్లోను ఎప్పటికప్పుడు ఎల్లారెడ్డి నీటి పారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు పరిశీలిస్తున్నారు.



పొంగిపొర్లుతున్న పోచారం ప్రాజెక్టు



కలిసుంటే కలదు సుఖం

- ప్రతీ సంవత్సరం సుమారు 70 మంది కుటుంబ సభ్యులను కలుస్తున్న మద్ది పరివార్
- ఈ ఏడాది గాజులు, కొత్త దుస్తుల అందజేత

7లో

ప్రభుత్వ పథకాలను తెలియజేసే వారే జర్నలిస్టులు

- సమాజానికి సమాచారాన్ని అందించాలి
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు





రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

ప్రజాదరణ పొందిన నేత నరేంద్రమోదీ

- ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఎక్కువ శాతం ప్రజాదరణ పొందిన నేత నరేంద్రమోదీ అని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు పర్యాయాలుగా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసి పేద, మధ్యతరగతి ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను దరి చేరుస్తున్నాడని తెలిపారు. స్నేహం అందిస్తే సాయం చేస్తూ విద్వేషం చూపి ప్రజల ప్రాణాలను బలిగొంటున్న దేశాలకు దేశం వైపు చూడాలంటేనే భయభ్రాంతులు కలిగేలా నిర్ణయాలు తీసుకుంటున్న నేత నరేంద్రమోదీ అన్నారు. అనంతరం ఏబీవీపీ ఆధ్వర్యంలో వరద బీభత్సంతో నష్టపోయిన విద్యార్థులకు గిఫ్ట్ ఏ నోట్ బుక్ పేరిట జమ చేసిన పుస్తకాలు, పెన్నులు, ఇతర సామగ్రి పంపిణీ చేయడానికి సిద్ధం చేసిన వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, నాయకులు మురళీధర్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, రక్తదాత సమూహ నిర్వాహకుడు బాలు, ఏబీవీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక సిద్ధం



వరి కొనుగోలుకు ఏర్పాటు చేసిన దృశ్యం (ఫైల్)

- జిల్లాలో 3.11 లక్షల ఎకరాల్లో వరి సాగు
- 5.98 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడులు వస్తాయంటున్న వ్యవసాయశాఖ
- జిల్లా ఉన్నతాధికారులకు నివేదించిన అధికారులు
- 426 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు నిర్ణయం

కామారెడ్డి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్ల కోసం జిల్లా యంత్రాంగం ప్రణాళిక సిద్ధం చేసింది. ధాన్యం కొనుగోళ్లపై సిద్ధంగా ఉండాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇది వరకే ఆయా జిల్లాలకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లాలో కొనుగోళ్లపై జిల్లా ఉన్నతాధికారులు ప్రణాళికలు ఖరారు చేశారు. ఈ సీజన్‌లో ఎంతమేర వరి సాగయింది. ఏ స్థాయిలో దిగుబడులు వస్తాయి.కేంద్రాలకు ఎంత మేర ధాన్యం వస్తుంది అనే దానిపై వివరాలు సేకరించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఉన్నతాధికారులు సైతం ఆయా శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో సుమారు 3.11 లక్షల ఎకరాలకు పైగా వరి సాగయిందని 5.98 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వచ్చే అవకాశం ఉందని వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా వేసి అధికారులకు నివేదించారు. కొనుగోలు కేంద్రాలకు 5.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉంటుందని ఈ ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు.

జిల్లాలో 3.11 లక్షల ఎకరాల్లో వరి సాగు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో ఈ వానాకాలం సీజన్‌లో వరి సాగు విస్తీర్ణం పెరిగింది. ఈ వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 3,11,738 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు అవుతుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అయితే ఇటీవల భారీ వరదలతో సుమారు 20వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. దీంతో మాచారెడ్డి, (మిగతా 8వ పేజీలో)

క్రైం సమాచారం

శభాష్ పోలీస్

● నాలుగు గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు


బాలుడు హుస్సేన్‌తో పోలీసులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 5వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చంద్రశేఖర్ కాలనీకి చెందిన సుమయ్యబేగం తన 8 ఏళ్ల కొడుకైన మహమ్మద్ హుస్సేన్‌ను భారతీనగర్ కాలనీలోని తన అమ్మగారి ఇంటి వద్ద వదిలివెళ్లింది. మహమ్మద్ హుస్సేన్ ఉదయం 8గంటల సమయంలో ఆడుకోవడానికి వెళ్లి సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో సుమయ్యబేగం 5వ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై గంగాధర్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టి 4గంట ల్లో బాలుడిని పట్టుకున్నారు. తల్లిదండ్రులు, కాలనీవాసులు పోలీసులను అభినందించారు.

కారు అద్దం ధ్వంసం.. మహిళపై కేసు

నవీపేట,సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన లలితపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిరుపతి తెలిపారు. మంగళవారం నవీపేట కారోబార్ చింతల రమేష్ కారు ముందు అద్దాన్ని అకారణంగా రాయితో దాడి చేయడంతో ధ్వంసమైందని ఎస్‌ఐ పేర్కొన్నారు. కారోబార్ రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అధికారులకు ఆటంకం కలిగిస్తున్న వ్యక్తి రిమాండ్

బోధన్,సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): బోధన్ మున్సిపాలిటీ అధికారులకు తరుచు ఇబ్బందులకు గురి చేస్తున్న జునేద్ హైమద్ ఖాన్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి బుధవారం కోర్టుకు రిమాండ్ కు తరలించినట్లు బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. బోధన్ మున్సిపాలిటీ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్‌కు రాకాసిపేట్‌కు చెందిన జునేద్ హైమద్ ఖాన్ అనే వ్యక్తి తరుచు మున్సిపల్ కార్యాలయంకు వస్తూ అతనితో పాటు ఇతర మున్సిపల్ అధికారులను అనవసరంగా విధులు నిర్వహించకుండా అటంకపరుస్తున్నాడని, బెదిరింపులకు పాల్పడుతున్నాడని మున్సిపల్ ఏఈ శ్రీనివాస్ ఫిర్యాదు చేశారన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించామన్నారు.

చోరికి పాల్పడ్డ యువకుడు అరెస్టు - రిమాండ్

బీర్కూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానం పరిధిలో గల వినాయక స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. అయితే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన యువకుడిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేపట్టారు. ఆలయంలో చోరికి పాల్పడినట్లు యువకుడు ఒప్పుకున్నాడు. ఆలయంలో చోరీ చేసిన వెండి గణపతి ప్రతిమను, ఇతర నగలను యువకుడు పోలీసులకు అప్పగించాడు. యువకుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజ శేఖర్ తెలిపారు.

ఇసుక డంప్‌ల సీజ్

సాలూర,సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని హున్సా గ్రామ శివారులో ఉన్న ఇసుక డంప్‌లను బుధవారం సీజ్ చేసినట్లు మండల తహసీల్దార్ శశిభూషణ్ తెలిపారు. సీజ్ చేసిన ఇసుకను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పంపించామన్నారు.

వ్యక్తి అదృశ్యం

సిరికొండ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన కుంచెం సుమన్ 16న మధ్యాహ్నం 12గంటలకు మద్యం తాగి వచ్చి భార్యను డబ్బులు అడుగగా ఇవ్వనందుకు ఇంట్లో నుండి వెళ్లిపోయాడని ఆయన భార్య లత ఫిర్యాదుచేసింది. ఈ మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

మానవత్వం చాటుకున్న సీపీ

ఇందల్వాయి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వ్యక్తిని ఆదుకొని నిజామాబాద్ సీపీ ఉదారత చాటుకున్నారు. డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నడిపల్లి గ్రామ శివారులో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న అశోక్ గాబ్రీ అనే వ్యక్తి అదుపుతప్పి రోడ్డు పక్కన పడిపోయి తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. రక్తస్రావంతో బాదపడుతుండగా అటువైపు నుంచి వెళుతున్న నిజామాబాద్ సీపీ సాయి చైతన్య కారు ఆపి ఆ వ్యక్తిని పరామర్శించి వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేసి నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎస్సై, సీఐలపై అధికారులకు ఫిర్యాదు

నిజామాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లరాంపూర్ గ్రామంలో గౌడస్థులకు గ్రామస్థులకు జరిగిన వివాదం నేపథ్యంలో గ్రామంలో ఈ నెల 21 వరకు తహసీల్దార్ మల్లయ్య కర్ఫ్యూ విధించారు. ఇదిలా ఉండగా గ్రామానికి చెందిన పలువురిని ఇండ్లలోకి చొరబడి మరీ దాడులు చేశారంటూ స్థానిక ఎస్సైతో పాటు సీఐపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

పట్టపగలే దొంగతనం

● 5 తులాల బంగారం, 10 తులాల వెండి

మెండోర , సెప్టెంబరు, 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మేర రామకృష్ణ ఇంట్లో పట్టపగలే భారీ దొంగతనం జరిగిందని స్థానిక ప్రజలు తెలిపారు. వివరాలు.. రామకృష్ణ, సతీమణి దంపతులు ఇంటికి తాళం వేసి పనికి వెళ్లగా, కుమారుడు పాఠశాలకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాగానే ఇంటి తలుపులు పగలగొట్టి ఉండటంతో తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. వారు హుటాహుటిన వచ్చారు. ఇంట్లో ఉన్న 5 తులాల బంగారాం, పది తులాల వెండి, రూ.30 వేలు దుండగులు ఎత్తుకెళ్లారని కన్నీటి పర్యంతం అయ్యారు. సంఘటన స్థలాన్ని ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై సుహాసిని పరిశీలించారు.

ఇరువురు వ్యక్తులు నీటిలో గల్లంతు

నిజాంసాగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి, బంజపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు బుధవారం నీటిలో గల్లంతయ్యారు. ఎస్‌ఐ శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని బంజపలికి చెందిన వడ్ల రవి (42) నాగమడుగు సమీపంలో కాలకృత్యాలకు వెళ్లి నీటిలో గల్లంతయ్యాడు. బ్రాహ్మణపల్లికి చెందిన నీరుడు మొగులయ్య (35) గ్రామ శివారులోని జానకమ్మ కుంటలో స్నానానికి వెళ్లి గల్లంతయ్యాడు. సంఘటన స్థలాలను పోలీసుల సందర్శించి మృతదేహాలను వెలికి తీసేందుకు గాలింపు చర్యలు చేపడుతున్నారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

వీధి కుక్కల హతంపై కేసులు

బోధన్,సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని పెంటాఖుర్దు గ్రామంలో రెండు రోజుల క్రితం గ్రామంలోని వీధి కుక్కలను చంపిన ఘటన తెలిసిందే. గ్రామంలో వీధి కుక్కలు అధికమై గ్రామస్థులను కరవడంతో విసిగిపోయిన గ్రామస్థులు వీధి కుక్కలను హతమార్చేందుకు విష ప్రయోగం చేసి చంపినట్లు తెలిసింది. ఈ విషయాన్ని కొందరు జంతు ప్రేమికులైన కరీంనగర్‌కు చెందిన ఎన్‌జీవోలకు అందజేశారు. దీంతో కరీంనగర్‌కు చెందిన ఎన్‌జీవోలు బోధన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు గ్రామ పంచాయతీ కార్యదర్శితో పాటు పంచాయతీ కార్మికులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అదే గ్రామంలో వీధి కుక్కలకు పోస్టుమార్టం నిర్వహించి శాంపిళ్లను సేకరించి హైదరాబాద్‌లోని రెడ్‌హిల్స్‌లో గల పోలీస్ క్యాంప్‌కు పంపించినట్లు తెలిసింది. జంతు ప్రేమికులు త్వరలో పెంటాఖుర్దు గ్రామానికి రానున్నట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న నాగార్జున భార్య బ్లూక్రాస్ సభ్యురాలు అమల రెండు రోజుల్లో గ్రామానికి రానున్నట్లు సమాచారం.

వ్యక్తిపై గృహ హింస కేసు

బీర్కూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిస్టాపూర్ గ్రామానికి చెందిన ఒక వివాహిత తన భర్త శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని బీర్కూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఆమె భర్త సాయినాథ్‌పై గృహ హింస కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సాయినాథ్ మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా హిప్పరాకు చెందిన వాడన్నారు.

ఘనంగా ప్రధాని జన్మదిన వేడుకలు

నెట్‌వర్క్: నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల విద్యార్థులచే మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మరికొన్ని చోట్ల రక్తదాన శిబిరాలు, ఆలయాల్లో పూజలు, పారిశుధ్య కార్మికులకు సన్మానాలు వంటి కార్యక్రమాలు నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.


భీమ్‌గల్‌లో పాఠశాలలో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు


వెంచిర్యాల్‌లో పూజలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు


కమ్మర్‌పల్లిలో పారిశుధ్య కార్మికులకు సన్మానం


రుద్రూర్‌లో స్వీట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం


నాగలింగేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం


కమ్మర్‌పల్లిలో పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు


కోటగిరిలో కేక్‌కట్ చేస్తున్న బీజేపీ నాయకులు


వర్నిలో ప్రధాని జన్మదిన వేడుకలు

ఎస్సారెస్పీని సందర్శించిన షబ్బీర్ అలీ

మెండోర , సెప్టెంబరు, 17(ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టును బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ రాష్ట్ర సలహాదారుడు షబ్బీర్ అలీ బుధవారం సందర్శించారు. ఆదిలాబాద్ జిల్లా పర్యటన ముగించుకొని హైదరాబాద్ తిరుగు ప్రయాణంలో పోచంపాడ్ గెస్ట్‌హౌజ్ లో కొద్దిసేపు సేద తీరి ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వివరాలను ప్రాజెక్టు అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఆయన వెంట వేల్పూర్ మార్కెట్ కమిటి చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, బాల్కొండ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ దేన్‌పాల్ గంగాధర్, సోం రాజేందర్, రమేష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి

ఆర్మూర్, సెప్టెంబరు, 17(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని వాటిని సమానంగా స్వీకరించాలని డీసీపీ బస్వరెడ్డి అన్నారు. బుధవారం చేపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్మూర్ మండల అంతర్ పాఠశాలల క్రీడల ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మార చంద్రమోహన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీవన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నారెడ్డి, తదితరులు ఉన్నారు.

ప్రజలకు న్యాయం చేయగల పార్టీ కాంగ్రెస్

ఆలూర్, సెప్టెంబరు, 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లెడి గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తల ముఖ్య సమావేశాన్ని డీసీసీ జనరల్ సెక్రటరీ డేగ పోశెట్టి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీనే ప్రజలకు న్యాయం చేయగల పార్టీ అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ శక్తిని ప్రజలకు చూపించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, మహేష్, రమేష్, శివ, యోహన్, అబి, కృష్ణ, రవి, తదితరులు పాల్గొన్నారు.


పండ్లు పంపిణీ చేస్తున్న జాతీయ పసుపుబోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి

రక్తదానం ఎంతో గొప్పది

జక్రాన్‌పల్లి , సెప్టెంబరు, 17 (ఆంధ్రజ్యోతి): అన్ని దానాల కంటే రక్తదానం చేయడం ఎంతో గొప్పదని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి అన్నారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా మండలంలోని తొర్లికొండ గ్రామంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు రత్నగారి వంశీగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 30 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాని జన్మదినం సందర్భంగా రక్తదానం చేయడం ఎంతో గొప్పదన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ గౌడ్, మండల బీజేపీ అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్, బీజేపీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సంజీవ్‌గౌడ్, ఈర్ల బాలయ్య, భూమేశ్వర్, రాజారెడ్డి, సంతోష్, క్రాంతి కుంట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా ప్రజా పాలన దినోత్సవం

నెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా ప్రజా పాలన దినోత్సవాన్ని అధికారులు, పలు పార్టీల నాయకులు ఘనంగా నిర్వహించారు. అధికారులు ప్రభుత్వ కార్యాలయాల్లో, నాయకులు ఆయా పార్టీల కార్యాలయాల వద్ద జాతీయ జెండాలు ఎగరవేశారు.


నందిపేటలో జాతీయ జెండా ఎగరవేస్తున్న బీజేపీ నాయకులు


ఆర్మూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో..


వేల్పూర్‌లో జెండా ఎగురవేస్తున్న డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి


వేల్పూర్‌లో జెండా ఎగురవేస్తున్న ఏఎంసీ చైర్మన్ ముత్యంరెడ్డి


బాల్కొండ ప్రభుత్వ పాఠశాలలో


మోర్తాడ్‌లో జెండా ఎగురవేస్తున్న బీజేపీ నాయకులు


పెగడాపల్లిలో రక్తదాన శిబిరం దృశ్యం

నానో యూరియా వాడకంపై అవగాహన

వేల్పూర్, సెప్టెంబరు, 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం నానో యూరియా వాడకంపైన ఏవో శృతి రైతులకు అవగాహన కల్పించారు. సాంప్రదాయ యూరియాతో పోలిస్తే నానో యూరియా ఘనపరిమాణం అతి తక్కువగా ఉండి ఎక్కువ ఉపరితల వైశాల్యం కలిగి ఉంటుందని వివరించారు. ఒక యూరియా బస్తాని 500 మిల్లీ లీటర్ల నానో యూరియా బాటిల్ సమర్థవంతంగా భర్తీ చేస్తుందని రైతులు నానో యూరియా వాడకాన్ని అలవాటు చేసుకోవాలని ఏవో సూచించారు. ఏఈవోలు తిరుమల, సొసైటీ సేల్స్‌మేన్ సతీష్, సెక్రటరీ కృష్ణ, రైతులు సాయిరెడ్డి, శేఖర్, పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయి: ఎమ్మెల్యే

వేల్పూర్ , సెప్టెంబరు, 17(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శరీరదారుఢ్యాన్ని పెంపొందిస్తాయని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. వేల్పూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం మండల స్థాయి అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు.విద్యార్థులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్‌లో వేల్పూర్ ప్రథమ స్థానంలో నిలువగా , పడిగెల్ ద్వితీయ, పచ్చల నడ్కుడ తృతీయ స్థానంలో నిలిచింది. వీరికి ఎమ్మెల్యే బహుమతులు అందించారు. స్థానిక ఎంఈవో రేణుక, హెచ్‌ఎం రాజన్న, మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు, క్రీడాకారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛ కార్యక్రమాలు ప్రతి గ్రామంలో నిర్వహించుకోవాలి

సదాశివనగర్, సెప్టెంబరు 17: గ్రామాల్లో స్వచ్ఛా కార్యక్రమాలను నిరంతరం నిర్వహించుకుంటే పరిసరాలతో పాటు గ్రామాలు కూడా పరిశుభ్రంగా ఉండి ఆరోగ్యకరంగా ఉంటాయని ఎంపీడీవో సంతోష్‌కుమార్ అన్నారు. బుధవారం ఆదర్శ పాఠశాలలో స్వచ్ఛాతాహి సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలను, కలుపు మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో యోసెఫ్,ప్రిన్సిపాల్ రాజారెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

విశకర్మ జయంతి వేడుకలు

విశ్వకర్మ జయంతి వేడుకలను జిల్లాలోని పలు మండలాల్లో విశ్వ బ్రాహ్మణ సంఘు సభ్యులు ఘనంగా నిర్వహించారు. మరోవైపు పలు పార్టీల ఆధ్వర్యంలోనూ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కొన్ని చోట్ల సేవా కార్యక్రమాలు చేపట్టారు.


కమ్మర్‌పల్లిలో..


డొంకేశ్వర్‌లో వేడుకలు


ఏర్గట్లలో..

నర్సరీల్లో మొక్కల జాగ్రత్తగా పెంచాలి

డొంకేశ్వర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నర్సరీలలో మొక్కల సంరక్షణ పకడ్బందీగా చేపట్టాలని డొంకేశ్వర్ ఎంపీడీవో లింగం అన్నారు. మండలంలోని తొండకూరు గ్రామంలో నర్సరీ, వర్మీ కంపోస్టు కేంద్రాన్ని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయితీ సిబ్బందికి వర్మి కంపోస్టును తయారు చేయడంపై పలు సూచనలు చేశారు. నర్సరీలను మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీటిని అందించాలని జాగ్రత్త పెంచాలని సూచించారు. ఆయన వెంట కార్యదర్శి రవి ఫీల్డ్ అసిస్టెంట్ నవీన్ తదితరులు ఉన్నారు.

తప్పని యూరియా తిప్పలు

జక్రాన్‌పల్లి , సెప్టెంబరు, 17(ఆంధ్రజ్యోతి): గత కొద్దిరోజులుగా యూరియా కొరతతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. బుధవారం మండలంలోని కొలిప్యాక్ ఎరువుల గోదాం వద్ద యూరియా కోసం రైతులు గుమిగూడారు. యూరియా తక్కువ రావడంతో రైతులకు ఒకొక్కరికి రెండుచొప్పున యూరియా బస్తాలను పంపిణీ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకొని యూరియా కొరత లేకుండా చూడాలని కోరుతున్నారు.

గోమాతకు అంతిమ సంస్కారం

బాన్సువాడ రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్ర జ్యోతి): బాన్సువాడ మండలంలోని ఇబ్రహీం పేట్ గ్రామంలో శ్రీ నిలయం రైస్‌మిల్‌కు చెందిన ఆవు(గో మాత) అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. దింతో స్థానికుల సహాయంతో రైస్‌మిల్ కార్మికులు హిందు సంప్రదాయం ప్రకారం గోమాతకు స్నానం చేయించి కుంకుమ, పసుపు, పూలతో అలంకరించి ట్రాక్టర్‌లో తీసుకెళ్లి గంగా జలాభిషేకంతో వేదమంత్రోచ్చరణల నడుమ అంతిమ సంస్కారం చేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కోటగిరి, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలం రాంపూర్ తండా గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం ఎన్‌ఆర్‌ఐ కోనేరు శశాంక్ రూ.20వేల ఆర్థికసాయం అందించారు.

గుంత పూడ్చిన యువకులు

కోటగిరి, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని కొడిచర్ల గ్రామానికి చెందిన జై హనుమాన్ యూత్ సభ్యులు బుధవారం రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. కొడిచర్ల నుండి పోతంగల్‌కు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. పలువురు ప్రమాదాల బారిన పడడంతో యూత్ ఆధ్వర్యంలో గుంతలను మొరం వేసి పూడ్చివేశారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు వెంకటేష్, గణేష్, సాయిలు, గంగారాం, సాయి, రాజు పాల్గొన్నారు.

ఐకేపీ భవనానికి ఉచిత స్థలం

ఏర్గట్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి 600 గజాల స్థలాన్ని బుధవారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఉచితంగా కేటాయించారు. ఈ మేరకు చేసిన తీర్మాణాన్ని ఐకేపీ ఏపీఎమ్ కంట గంగాధర్‌కు అందజేశారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి జుంగల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు అరుణ్ యాదవ్, సభ్యులు పాల్గొన్నారు.

కీడా దుస్తుల పంపిణీ

జక్రాన్‌పల్లి , సెప్టెంబరు, 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలూర్ గ్రామంలో బుధవారం పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులను దాత నిమ్మల శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాస్ కలిసి పంపిణీ చేశారు. కొలిప్యాక్ సొసైటీ చైర్మన్ నాగుల శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళల సంరక్షణే ధ్యేయం

బోధన్,సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా శ్వాస్త నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం బోధన్‌లో ప్రారంభించడం జరిగిందని, ఈ కార్యక్రమం అక్టోబర్ 2వరకు కొనసాగుతుందని బోధన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సమత అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌లో గల ప్రాథమిక కేంద్రంలో గైనకాలాజిస్టు వైద్యులు ఫరీన్ మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించారు.

మర్రి ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

పాల్వంచ, సెప్టెంబరు 17: మండలకేంద్రంలోని మర్రి షాప్ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కట్ట ప్రశాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సంగారెడ్డి, అర్షద్, సురేష్, కోశాధికారిగా దేవరాజు, ప్రధానకార్యదర్శిగా హరిష్, కార్యదర్శిగా ఆంజనేయులు, సలహాదారులుగా కట్ట శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మల్లేశం, తదదితరులు ఎన్నికయ్యారు.

నేటి నుంచి మండల స్థాయి అంతర్ పాఠశాల క్రీడలు

జక్రాన్‌పల్లి , సెప్టెంబరు, 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు మండలస్థాయి అంతర్ పాఠశాలల క్రీడలను నిర్వహించనున్నట్లు క్రీడల నిర్వహకుడు, ప్రధానోపాధ్యాయుడు సురేందర్‌రెడ్డి తెలిపారు. ఈ క్రీడల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి వస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్‌ల అందజేత

ఆర్మూర్ టౌన్, సెప్టెంబరు, 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ పలువురి బాధితులకు సెల్‌ఫోన్‌లను అందజేశారు. ఇటీవల తమ సెల్‌ఫోన్‌లను పోగొట్టుకోవడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సేకరించి బాధితులకు అందజేశారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

ఆర్మూర్ టౌన్, సెప్టెంబరు, 17 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని మెడికల్ భవన్‌లో అంగవాడీ ఉపాధ్యాయులకు రెండవ రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. పోషన్ బీ పడాయి బీ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సీడీపీవో భార్గవి ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్‌లు నలిని, ఎం. రేఖ, బి. రమ, అన్నపూర్ణ, వెంకట్‌రమణ పాల్గొన్నారు.


మద్నూర్ జర్నలిస్టుల సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

ప్రభుత్వ పథకాలను తెలియజేసే వారే జర్నలిస్టులు

» జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

మద్నూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమాజానికి అవసరమైన సమాచారాన్ని ప్రజలకు అందించడం లో, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, అలాగే అభివృద్ధి, సామాజిక సంక్షేమ పథకాలకు కాపలాదారులుగా నిలవడంలో జర్నలిస్టుల పాత్ర చాలా కీలకమైనదని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు గుర్తు చేశారు. బుధవారం మద్నూర్ మండల కేంద్రంలో టీయూడబ్ల్యూజే జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన కార్యవర్గ సన్మాన సభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో టీయూడబ్ల్యూజే చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులను శాలువాతో సన్మానించారు.

వరద బాధితులకు కిట్ల పంపిణీ

మద్నూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మద్నూర్ మండలంలో గత నెలలో కురిసిన వర్షాలకు ఇండ్లు దెబ్బతిన్న బాధితులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కిట్లను బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి బుధవారం అందజేశారు. మద్నూర్ మండల కేం ద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బాధితులకు సబ్ కలెక్టర్ కిరణ్మయి చేతుల మీదుగా కిట్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ రాజన్న, రాష్ట్ర బాధ్యులు సంజీవరెడ్డి, మండల చైర్మన్ ప్రకాష్, తహశీల్దార్ ముజీబ్ , రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బాన్సువాడటౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బుధవారం సర్ణకార సంఘం ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గురజాల పాండురంగం , వెంకటేశం గురుస్వామి పాల్గొన్నారు.

హిందీ దివస్ సాప్తాహిక్

మద్నూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో తెలంగాణ గురుకుల బాలుర విద్యాలయం, జూనియర్ కళాశాలలో హిందీ దివస్ సాప్తాహిక్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గంగా కిషోర్ మాట్లాడుతూ హిందీ రచయితలు వారి హృదయాలను తమ రచనల్లో ధారపోశారని, సాంస్కృతిక వారసత్వం, సమత మమత భావాల సాహిత్యాన్ని విద్యార్థులు తెలుసుకోవాలని ప్రిన్సిపాల్ గంగాకిశోర్ అన్నారు. ప్రముఖ సంస్కృతాంధ్ర పద్యకవి డా బి.వెంకట్ మాట్లాడుతూ హిందీ భారతీయ సంస్కృతికి దర్పణంగా నిలిచే సంస్కార భాషయని అన్నారు.

మహిళలకు ఆరోగ్య పరీక్షలు


మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం నారి శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 17 నుంచి అక్టోబర్ 2 వరకు పట్టణంలో ఉన్న మహిళల అందరికీ ఉచిత ఆరోగ్య పరీక్షలు చేయించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని, కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఆర్పీలు వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ఇందిరా పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేటలో..

నాగిరెడ్డిపేట: స్వస్థ నారి సాక్షాత్ పరివార్ అభియాన్‌లో భాగంగా బుధవారం మండలంలోని పలు గ్రామాలలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది హెల్త్ క్యాంపులో నిర్వహించి మహిళలకు వైద్యం అందించారు. మండలంలోని ఆత్మకూర్, బొల్లారం, జలాల్ పూర్, జప్తి జానకంపల్లి, తాండూర్ , వదల పర్తి గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరాల్లో 296 మంది మహిళలకు రక్త పరీక్షలు, షుగర్, హైపర్ టెన్షన్, డయాబెటిస్, హెచ్‌బీ పరీక్షలు నిర్వహించి రోగులకు మందులు పంపిణీ చేసినట్టు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సృజన్ కుమార్ తెలిపారు.

కలిసుంటేనే కలదు సుఖం

» తాడ్వాయి మద్ది పరివార్ వినూత్న ఆలోచన

తాడ్వాయి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నేటి కంప్యూటర్ యుగంలో మనుషులు ఒకరికొకరు కలుసుకునే సమయం దొరకడం లేదు. అలాంటిది మండల కేంద్రానికి చెందిన మద్ది పరివార్ వినూత్న ఆలోచనలతో ప్రతీ సంవత్సరం సుమారు 70 మంది కుటుంబ సభ్యులు కలుస్తున్నారు. ఈ సంవత్సరం కుటుంబ సభ్యులు మొత్తం ఒకే చోట చేరి స్త్రీలకు గాజులు నూతన వస్త్రాలు తీసుకువస్తారు. అలాగే పురుషులకు కొత్త కండువాలు, కొత్త దుస్తులను తీసుకువచ్చి ఇస్తారు. వచ్చిన సభ్యులు తమ కుటుంబ సాధక, బాధకాలను చర్చించుకుంటారు. దీంతో మద్ది పరివార్ కుటుంబ సభ్యుల మధ్య మరింత సాన్నిహిత్యం పెరుగుతుందని సభ్యులు అంటున్నారు.


కుటుంబ సభ్యులు కలిసి నూతన గాజులు ధరిస్తున్న దృశ్యం


మద్ది పరివార్ కలిసిన కుటుంబం

కామన్ స్కూల్ విద్యా విధానం రావాలి

» ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

ఇందూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని కులాల పేద, నిరుపేద పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారని అన్ని విద్యావ్యవస్థలలో ఒకేవిధమైన విద్యావ్యవస్థలే ఉండాలని కామన్ స్కూల్ విద్యా విధానం రావాలని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని న్యూఅంబేద్కర్ భవనంలో బుధవారం జరిగిన పీఆర్‌టీయూటీఎస్ జిల్లా సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రకాల విద్యా వ్యవస్థలు కాకుండా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు అన్ని కూడా ఒకే విధమైన విద్యా వ్యవస్థ ఉండాలన్నారు. ఇతర రాష్ట్రాలలో వలె టెట్ గురించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధానితో మాట్లాడానన్నారు. టెట్ నుంచి మినహాయింపు ఇచ్చేవిధంగా కోర్టులో రిట్ పిటిషన్ వేసేవిధంగా ముఖ్యమంత్రితో మాట్లాడి అధికారులకు ఆదేశాలు ఇప్పించామన్నారు. మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా వెంటనే సీపీఎస్‌ని రద్దుపరచి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేసేవిధంగా ప్రభుత్వాన్ని ఒప్పించి జీవో ఇప్పిస్తామన్నారు. ఉపాధ్యాయుల ప్రధాన సమస్యలైనా పెండింగ్ బిల్లులు సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పుల్గం దామోదర్ రెడ్డి, భిక్షంగౌడ్, ఆడిట్ కమీటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, పిఆర్‌టియు రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, పీఆర్టీయూ మాజీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వంగ మహేందర్ రెడ్డి, పిఆర్టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మోహన్ రెడ్డి, కిషన్ మరియు జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శులు పెంట జలంధర్, వెంకటేశ్వర గౌడ్, తుమ్మల లక్ష్మణ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు అంకం నరేష్, గంట అశోక్, సరిత, రాద, మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాష్ట్ర జిల్లా మండల కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మోదీ జన్మదినం.. జాతీయ నిరుద్యోగ దినం


బైక్ రిపేర్ చేస్తూ నిరసన తెలుపుతున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

బాన్సువాడటౌన్ , సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదినం, జాతీయ నిరుద్యోగ దినమని యూత్ కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం బాన్సువాడ పట్టణంలో ఛాయ్ అమ్ముతూ, బైక్ రిపేర్ చేస్తూ వారు నిరసన తెలిపారు. దేశ ప్రధాని మోదీ యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తానని మోసం చేశారని మండిపడ్డారు. ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసి యువతను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సయ్యద్ మన్సూర్, తిరుమల్‌రెడ్డి, సలీం, శ్రీనివాస్, అందె రమేశ్ తదితరులున్నారు.

ఎస్‌జీఎఫ్ మండల జట్టుకు గురుకుల విద్యార్థులు ఎంపిక


వాలీబాల్ పోటీలలో ఎంపికైన విద్యార్థులు

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): ఎల్లారెడ్డి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వాలీబాల్ అండర్ 14, 17 జట్లను ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు వాలీబాల్ ఎల్లారెడ్డి మండల జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మహమ్మద్ రఫత్ తెలిపారు. త్వరలో గాంధారిలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో జరిగే జిల్లా స్థాయి పోటీలో వీరు పాల్గొంటారన్నారు. ఎంపికైన నలుగురు విద్యార్థులను బుధవారం పాఠశాల పీఈటీ జ్ఞానేశ్వర్, ఉపాధ్యాయులు బాలరాజ్, ప్రవీణ్, మంజూర్ ఖాన్ తదితరులు అభినందించారు.

స్వచ్ఛ బాన్సువాడ కోసం కృషి చేద్దాం

● బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు

బాన్సువాడటౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛబాన్సువాడ కోసం కృషి చేద్దామని బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం నుంచి స్వచ్ఛోత్సవ్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ప్రధాన రహదారి గుండా సాగింది. ఈ ర్యాలీ లో నాయకులు , విద్యార్థులు తదితరులున్నారు.



బాన్సువాడలో స్వచ్ఛోత్సవ్ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ కిరణ్మయి


బాన్సువాడ మున్సిపాలిటీ కార్యాలయంలో..


నాగిరెడ్డిపేట ఎంపీడీవో కార్యాలయంలో..

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

బాన్సువాడ టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ కిరణ్మయి జాతీయ జెండాను ఎగురవేశారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రీహరిరాజు జెండాను ఎగురవేసి వందనం చేశారు. డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ విఠల్‌రెడ్డి సీఐలు, కానిస్టేబుళ్ల తో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు. హైదరాబాద్‌లోని ఆగ్రో ఇండస్ట్రీస్ కార్యాలయంలో చైర్మెన్ కాసుల బాల్‌రాజ్ జాతీయ జెండాను ఎగురవేశారు.

ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట: ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాల్లో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా బుధవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి వేడుకలను నిర్వహించారు.

మద్నూర్: ఉమ్మడి మద్నూర్ మండలంలో ఆయా ప్రభుత్వ కార్యాలయాలలో భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగరవేశారు.

ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

బాన్సువాడటౌన్: దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను బుధవారం బాన్సువాడ బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా బీజేపీ కార్యాలయంలో తెలంగాణ విమోచన దినోత్సవంలో భాగంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్థానిక అయ్యప్ప ఆలయంలో పూజలు చేపట్టారు.

బీర్కూర్‌లో..

బీర్కూర్: మండల కేంద్రంలో బుధవారం దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మోదీ జన్మదినం సందర్భంగా బీర్కూర్ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహించి అనంతరం, భారతదేశ ప్రధాని నరేంద్ర మోది జన్మదిన వేడుకలను ఎల్లారెడ్డిలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి రక్తదానం చేశారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అంతకుముందు ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో బిజెపి నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి, నీలం చిన్న రాజులు, బాణాల లక్ష్మారెడ్డి, లింగారావు, మండల అధ్యక్షుడు నర్సింలు, పట్టణ అధ్యక్షుడు రాజేష్, మహిళా నాయకులు సుజాత, హైమారెడ్డి పాల్గొన్నారు.


బీర్కూర్‌లో రోగులకు పండ్లను పంపిణీ చేస్తున్న దృశ్యం


ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో


బాన్సువాడలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం



ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం


ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ..


దొంగ్లి తహసీల్దార్ కార్యాలయంలో ..


మద్నూర్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేసిన బీజేపీ నాయకులు

యూరియా ఇవ్వలేని అసమర్థ ఎంపీలు రాజీనామా చేయాలి

» బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, సెప్టెంబరు, 17(ఆంధ్రజ్యోతి): రైతులకు బస్తా యూరియా ఇప్పించలేని అసమర్థ ఎంపీలు తమ పదవులకు రాజీనామా చేయాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. వేల్పూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో యూరియా కొరత రోజురోజుకు తీవ్రతరం అవు తుందన్నారు. అన్నం లేకుండా నిద్రహారాలు మాని గంటల తరబడి రైతులు యూరియా కోసం పడిగాపులు పడుతూ, చెప్పులు పాస్ బుక్‌లు లైన్‌లో పెట్టే పరిస్థితి మళ్లీ వచ్చిందన్నారు. రైతులు ఇబ్బంది పడుతున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా లేదన్నారు. బాల్కొండ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో యూరియా కోసం రైతులు కష్టాలు పడుతున్నారని, తండాల నుంచి వచ్చి యూరియా తీసుకుపోవడానికి పడు తున్న ఇబ్బందులు ప్రభుత్వానికి కనబడడం లేదా అన్నారు. బాల్కొండ మం డలంలో వంద యూరియా బస్తాలు వచ్చాయని వాటిని పది గ్రామాలకు, మెండోర, వేల్పూర్, మండలంలో ఒక వెయ్యికి 90 బస్తాలు వచ్చాయని వాటిని ఏ విధంగా పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. మోర్తాడ్ మండల దోన్‌పాల్ గ్రామంలో పోలీస్‌లపు పెట్టి టోకెన్‌లను పంపిణీ చేశారన్నారు. రైతులు యూరియా కోసం అల్లాడుతుంటే ఎంపీ అర్వింద్ ఎక్కడికి వెళ్లాడని పెద్ద మాటలు, అడ్డగోలుగా తిట్టే అరవింద్ యూరియా ఎందుకు తెప్పించడం లేదన్నారు. జిల్లాకు 75 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం అయితే 72 వేల యూరియా వచ్చిందని అధికారులు చెప్తున్నారని వచ్చిన యూరియా యూరియా ఎటు వెళ్లిందని కాంగ్రెస్ నేతలు బ్లాక్ మార్కెట్ కు వెళ్లిందా వీటిపై సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

పర్యాటకులను ఆకర్షించేలా మినీ ట్యాంక్ బండ్‌ను తీర్చిదిద్దాలి

» కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పర్యాటకులను విశేషంగా ఆకర్షించేలా నిజామాబాద్ నగరంలోని ఖిల్లా రఘునాథ చెరువు మినీ ట్యాంక్ బండ్ ప్రదేశాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మినీ ట్యాంక్ బండ్‌తో పాటు న్యాల్‌కల్ రోడ్ ఆర్టీసీ డిపో 2 పద్మానగర్, గౌతంనగర్ తదితర ప్రాంతాలను సందర్శించారు. ఆయా ప్రదేశాలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి అనువైన పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. మినీ ట్యాంక్ బండ్ వద్ద ఆహ్లాదకర వాతావరణం, ఉద్యానవనం, చిన్నారుల కోసం ప్లే జోన్ తదితర వసతులు ఉండడాన్ని గమనించారు. పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. నిరుపయోగంగా ఉన్న బాక్స్ క్రికెట్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు వీలుగా దీని నిర్వహణను ప్రైవేట్ వారికి వేలంపాట ద్వారా కేటాయించాలని ఆదేశించారు. రఘునాథ చెరువులో బోటింగ్ సౌకర్యాన్ని ప్రవేశపెట్టేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు.

రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాల పనితీరుపై కలెక్టర్ సమీక్ష

నిజామాబాద్ నగర పాలక సంస్థ రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాల పనితీరుపై కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి బుధవారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయంలో సంబంధిత విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వారం క్రితం నిర్వహించిన సమీక్షలో చేసిన సూచనలను పక్కాగా పాటిస్తున్నారా, ఏ మేరకు ప్రగతి సాధించారనే అంశాలను కలెక్టర్ పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరులో ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం పట్ల కలెక్టర్ సంతృప్తివ్యక్తం చేశారు. రెవెన్యూ విభాగం పనితీరులో మార్పు కానరాకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మ్యుటేషన్ లకు సంబంధించిన దరఖాస్తులను ఆన్లైన్‌లో ఎంట్రీ చేయాలన్నా.. ఎందుకు అలసత్వం వహిస్తున్నారని మండిపడ్డారు. ప్రతి దరఖాస్తును ఆన్లైన్‌లో ఎంట్రీ చేయాలని ఆదేశించారు. దరఖాస్తుదారులే సంబంధిత పోర్టల్ ద్వారా మ్యుటేషన్ కోసం ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. పన్ను వసూళ్లు, మ్యుటేషన్ తదితర ప్రక్రియలు అన్నీ పూర్తి పారదర్శకంగా జరగాలని, జాప్యానికి తావు లేకుండా ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. పన్ను వసూళ్లు వంద శాతం జరగాలని, భవన నిర్మాణాలకు అనుమతులు, క్రమద్ధీకరణ ప్రక్రియలను వెంటవెంటనే చేపడుతూ నగర పాలక సంస్థకు ఆదాయ వనరులను పెంపొందించాలని సూచించారు. సమీక్షా సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, అదనపు కమిషనర్ రవిబాబు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

» విశ్రాంత ఐఏఎస్ అధికారి చక్రపాణి

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి కృషి చేస్తానని విశ్రాంత ఐఏఎస్ అధికారి చక్రపాణి అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని స్నేహ సొసైటీలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో శాస్త్రీయపరంగా, విజ్ఞానపరంగా సదుపాయాలు లేక పోవడంతో అంగవైకల్యంతో జన్మించేవారని, నేడు జినోమ్ పరీక్షల ద్వారా అవయవాల నిర్మాణం, మేధస్సు స్థితి తెలుసుకోగలుగుతున్నామన్నారు. గర్భస్థంలో ఉన్న శిశువు ఏదైనా లోపాలతో ఉన్నట్లయితే లోపాలను సరిచేసి ఆరోగ్యకరమైన శిశువు జన్మించేలా శాస్త్ర సాంకేతికత అభివృద్ధి చెందిందన్నారు. మానసిక దివ్యాంగులు చేస్తున్న వొకేషనల్ ఉత్పత్తులైన ఫినాయిల్, పూసల వస్తువులను చక్రపాణి పరిశీలించారు. స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య అధ్యక్షత వహించిన కార్యక్రమంలో రైతు, సైనికుడిని ఘనంగా సన్మానించారు. టీఎంఆర్ ఫౌండేషన్ అశోక్‌కుమార్, స్మార్ట్ స్నేహ సొసైటీ అంధుల పాఠ శాల ప్రిన్సిపల్ జ్యోతి, మానసిక వికలాంగుల పాఠశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి, బీసీటీయూ రమణస్వామి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్స్ కమిటీ అధ్యక్షురాలిగా మహాదేవి

బాన్సువాడటౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ ప్రాజెక్టు అంగన్‌వాడీ టీచర్స్ , హెల్పర్స్ నూతన కమిటీ అధ్యక్షురాలిగా మహాదేవిని సభ్యులు ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలిగా శివగంగ, రాధ , వ జ్రమణి , ప్రధాన కార్యదర్శిగా సవిత, కోశాధికారిగా విజయలక్ష్మీలతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యుల ను సీడీపీవో సౌభాగ్యను కలిశారు.

సాయుధ పోరాటంతోనే ఆంక్షలు తొలగాయి

(5వ పేజీ తరువాయి)

వివరించారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా గ్రామీణ మహిళా సంఘాలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ. 382 కోట్ల 36 లక్షల, పట్టణ మహిళా సంఘ సభ్యులకు 39 కోట్ల రుణం అందించి నట్లు తెలిపారు. ఇందిరా మహిళ శక్తి పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 4,150 యూనిట్లను 87 కోట్ల 38లక్షల రూపాయల పెట్టుబడులతో, పట్టణ ప్రాంతాల్లో 154 యూనిట్లను రూ.5కోట్ల 89లక్షలతో వివిధ రకాల వ్యాపార సంస్థలను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆడపడుచులు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం అమలుచేస్తుందని తెలిపారు. మహిళలకు పైసా ఖర్చు లేకుండా రాష్ట్రం లో ఎక్కడి నుంచి ఎక్కడికైన ఉచితంగా ప్రయాణించే సౌలభ్యం ఈ పథ కం ద్వారా లభిస్తుందని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 5.25 కోట్ల మంది మహిళలు ఉచిత రవాణా సౌకర్యాన్ని వినియోగించుకున్నారని దీని ద్వారా మహిళలకు రూ.175.62 కోట్లు లబ్ధి చేకూరిందని తెలిపారు. గృహజ్యోతి కార్యక్రమం కింద 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తుందని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 1లక్ష 63వేల 163 మందికి ప్రభుత్వం రూ. 88కోట్ల 66లక్షల రాయితీని అందించిందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద జిల్లాలో 11 వేల 621 ఇళ్లు మంజూరు కాగా 6,063 ఇళ్లనిర్మాణం ప్రారంభించడం జరిగిందని అందులో 2 వేల 663 ఇండ్లు బెస్మిట్ లెవల్, 736 గోడల వరకు, 306 ఇండ్లు స్లాబ్ వరకు పూర్తిచేయడం జరిగిందని ఇప్పటివరకు లబ్ధిదారులకు 43 కోట్ల 21లక్షలు చెల్లించినట్లు తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద 17 వేల 27 మంది నిరుపేదలకు శస్త్ర చికిత్సలే, చికిత్స కోసం రూ.44 కోట్లను ఖర్చు చేయడం జరిగిందని అన్నారు. ఇటీవల వచ్చిన వరదల్లో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందా లు 15 ప్రాంతాల్లో 17 రక్షణ చర్యలు చేపట్టి 1251 మందిని కాపాడినట్లు తెలిపారు. 740 కుటుంబాలలోని సభ్యులకు 58 రిలిఫ్ క్యాంప్‌లు ఏర్పాటు చేసి వారికి ఆహారం, మందులు, ప్రాథమిక సౌకర్యాలు కల్పించామని తెలిపారు. నష్టపోయిన 1737 నివాస గృహాలకు 81లక్షల 85వేల నష్టపరిహారం మంజూరు చేసినట్లు వివరించారు. ప్రాణనష్టం జరిగిన 6 కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున సీఎం చేతుల మీదుగా అందించారని తెలిపారు. 28,615 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక పంపించినట్లు తెలిపారు. వరదల్లో పోలీసుల శాఖ త్వరితగతిన స్పందించి ధైర్య సాహసాలతో 800 మందికి పైగా రక్షించడం జరిగిందని తెలిపారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రాజేష్‌చంద్ర, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, ఏఎస్పీ చైతన్యరెడ్డి, స్థానిక సంస్థల కలెక్టర్ చందర్‌నాయక్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక సిద్ధం

(5వ పేజీ తరువాయి)

రామారెడ్డి, లింగంపేట్, గాంధారి, తాడ్వాయి, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, బిచ్కుంద, కామారెడ్డి మండలాల్లో ప్రతిఏటా వరి పంటను విస్తారంగా సాగు చేస్తుంటారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 2.90లక్షల ఎకరాల్లో వరి సాగైంది. వానాకాలం సీజన్‌లో విస్తారంగా వర్షాలు కురువడం, చెరువులు, కుంటలు జలకళను సంతరించుకోవడం, భూగర్భ జలాలు సైతం వృద్ధి చెందడంతో వరి విస్తారంగా సాగైనట్లు తెలుస్తోంది.

5.98 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడులు వచ్చే అవకాశం

జిల్లాలో ఈ యేడు భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండడం ప్రాజెక్టుల్లో, చెరువుల్లో, కుంటల్లో నీరు ఉండడంతో వానాకాలం సాగుకు రైతులు ఆశలు పెంచుకున్నారు. ప్రస్తుతం జిల్లాలో సాగైన 2.90 లక్షల ఎకరాల వరి సాగుకు సుమారు 5.98 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా దిగుబడులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. కామారెడ్డి డివిజన్ పరిధిలో 48,207 మంది రైతులు 72,800 ఎకరాలలో వరి సాగు చేయగా 1,82,001 మెట్రిక్ టన్నులు వస్తాయని, ఎల్లారెడ్డి డివిజన్‌లో 57,387 మంది రైతులు 77,765 ఎకరాలలో వరి సాగు చేయగా 1,94,413 మెట్రిక్ టన్నులలో, బాన్సువాడ డివిజన్‌లో 23,187 మంది రైతులు 35, 864 ఎకరాలలో సాగు చేయగా 8,96,661 మెట్రిక్ టన్నులలో, బిచ్కుంద డివిజన్‌లో 31,925 మంది రైతులు 46,191 ఎకరాలలో వరి సాగు చేయగా 1,15,478 మెట్రిక్ టన్నులలో దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. మరో 20 రోజుల్లో అయితే వరి కోతలు సైతం ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లకు జిల్లా అధికారులు సైతం సిద్ధమవుతున్నారు.

426 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయం

వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలని ప్రభుత్వం సైతం ఆయా జిల్లాల అధికారులను ఆదేశించింది. కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ సంబంధిత శాఖలైన పౌర సరఫరాలు, సహకార, ఐకేపీ వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులతో కొనుగోళ్లపై ఇటీవల సమీక్షించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కొనుగోలు చేపట్టాలని ఉన్నతాధికారులు సంబంధితశాఖ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ప్రణాళికను రూపొందించాలని ఆయా శాఖలను ఆదేశించారు. దీంతో గతంలో మాదిరిగానే జిల్లాలో మొత్తం 426 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికను రూపొందించారు. ఇందులో పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో 213, ఐకేపీల ఆధ్వర్యంలో 213 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ఏ గ్రేడ్ రూ.2389, బీ గ్రేడ్ రూ.2369 క్వింటాల్ చొప్పున కొనుగోలు చేయనున్నారు. ఈ వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు 1.50కోట్ల గన్నీబ్యాగులు అవసరమని నిర్ణయించారు. ఇందులో ప్రస్తుతం 36 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయి. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్‌మిల్లులకు తరలించనున్నారు. ట్రాన్స్‌పోర్ట్ కోసం 10 సెక్టార్లను విభజించారు.

కొనుగోళ్లకు ప్రణాళికను రూపొందించాం

● శ్రీకాంత్, సివిల్ సప్లయ్ డీఎం



వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు ఇప్పటికే ప్రణాళికను రూపొందించాం. 5.98 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ అంచనా వేసి నివేదించారు. ఈ లెక్కన కొనుగోలు కేంద్రాలకు 5.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉంటుంది. ధాన్యం దిగుబడులకు తగ్గట్టుగా జిల్లా వ్యాప్తంగా 426 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాం. గన్నీ బ్యాగులను సమకూర్చుతున్నాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనుగోళ్లు జరిగేలా ప్రణాళికను రూపొందిస్తున్నాం.

మరమ్మతులు తనిఖీ చేసిన డీఈ

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబరు 17: ఎల్లారెడ్డి మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో గల పెద్దచెరువు కట్ట ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు తెగిపోయిన సంగతి తెలిసిందే. ఈ చెరువు కట్ట తాత్కాలిక పునర్నిర్మాణ పనులను బుధవారం ఎల్లారెడ్డి నీటిపారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయకట్టు కింది పంట పొలాలను కాపాడటానికి వేగవంతంగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా వేగంగా చెరువు కట్ట మరమ్మతు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రతీ ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలి

బాన్సువాడ రూరల్, సెప్టెంబరు 17: బాన్సువాడ మండలంలోని హన్మాజీపేట్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన శివశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ఇమ్రాన్ మాట్లాడుతూ ఈ నెల 17 నుండి అక్టోబరు 1వరకు ఈ శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు మధుమేహం, టీబీ, గుండెపోటు, పక్షవాతం, రక్తకణాలు దెబ్బతిని కంటి చూపు తగ్గడం మొదలగు వాటి స్క్రీనింగ్ పరిక్షలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు విజయ్‌భాస్కర్, సూపర్‌వైజర్ పాప, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని జన్మదిన వేడుకలు

లింగంపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండల కేంద్రంలో బుధవారం బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో భారత దేశ ప్రధాని నరేంద్రమోడి 75వ జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడుపుతూ ప్రపంచంలో మూడవ అతి పెద్ద శక్తిగా భారత దేశాన్ని నిలిపారని ప్రధాని మోది ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండలపార్టీ అధ్యక్షుడు క్రాంతి, నాయకులు తల్వార్, నారాయణ, బాలయ్య, వడ్ల భీమయ్య, నరహరిలతో పాటు నాయకులు ఉన్నారు.

భిక్కనూరు, సెప్టెంబరు 17: భిక్కనూరు మండలంలోని జంగంపల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రధాని జన్మదినాన్ని పురస్కరించుకుని శ్రీరామ సిండికే ట్ ప్రతినిధులు బుధవారం విద్యార్థులకు పరిక్షా ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా సిండికేట్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రధాని మోడీని విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని బాగా చదివి ఉన్నత స్థాయిలో స్థిరపడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిండి కేట్ ప్రతినిధులు మీసాల ప్రవీణ్‌గౌడ్, నీల చంద్రం, కమ్మరి నరేందర్, నాగభూషణం, చెన్ని ప్రసాద్, హరి, రాము, తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు, సెప్టెంబరు 17: భిక్కనూరు మండలకేంద్రంలో ప్రధాని నరేంద దామోదర్‌దాస్ మోడీ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మండలకేంద్రంలోని చౌరస్తాలో కేక్ కట్ చేసి భిక్కనూరుప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు.

● యువకుల రక్తదానం..

ప్రధాని జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లాకేంద్రంలో భిక్కనూరు మండల బీజేపీ నాయకులు సింగిరెడ్డి విలాస్‌రెడ్డి, పొన్నాల రంజిత్ కుమార్, సందుగారి జైపాల్‌రెడ్డి, తక్కళ్ల రాజేందర్ రెడ్డి, జిల్లెల్ల లింగారెడ్డి, మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన అడ్వకేట్ దాసరి నాగరాజు రక్తదానం చేశారు.



లింగంపేటలో మోదీ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



రక్తదానం చేస్తున్న యువకులు



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల అందజేత

లంబాడీల ఐక్యవేదిక అధ్యక్షుడిగా జాదవ్‌మానిక్

బిచ్కుంద, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): బిచ్కుంద మండల లంబాడిల ఐక్యవేదిక కమిటి అధ్యక్షుడిగా జాదవ్ మాణిక్‌ప్రధానకార్యదర్శిగా పవర్‌హరిలాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అందుకు సంబంధించిన నియామక పత్రాన్ని బుధవారం రాష్ట్రకోఆర్డినేటర్ కాత్రోత్ రవీందర్‌నాయక్ అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజార ఐక్యతకోసం,బంజారుల హక్కుల కోసం ఐక్యవేదిక పోరాటం చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాథోడ్ శంకర్, జాదవ్ ధన్‌సింగ్, మోహన్,విజయ్,అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు

బాన్సువాడ రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని హన్మాజీపేట్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని బోర్లం క్యాంప్ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక వైద్యులు ఇమ్రాన్ విద్యార్థినీలకు వైద్య పరిక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీలు వ్యక్తిగత శుభ్రత పాటించి, తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈవో రవి, సూపర్‌వైజర్ పాషా, డీఎస్‌లు యశోద, దుర్గామణి, సావిత్రి, ఆశాలు పద్మ, సుచిత్ర పాల్గొన్నారు.

మహిళలకు వైద్యపరీక్షలు

లింగంపేట, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వాస్త్ నారి శ్వాశక్త్ పరివార్ అభియాన్‌లో బాగంగా మహిళకు వైద్యపరీక్షలు నిర్వహించారు. మొత్తం 56మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు వైద్యురాలు రాంబాయి తెలిపారు. బీపీ షుగర్ అనీమియా వ్యాదులకు ప్రత్యేక వైద్యురాలు రమాదేవి పరీక్షలు నిర్వహించారు.

నూతన జీపీఓకు సన్మానం

తాడ్వాయి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్కల్ గ్రామానికి నూతనంగా వచ్చిన జిపిఓ షైనీష్‌ను కన్కల్ గ్రామస్తులు బుధవారం గ్రామపంచాయతీలో సన్మానించారు. ఇందులో మాజీ సర్పంచ్ ప్రతాపరెడ్డి కార్యదర్శి విక్రం సింగ్, ఏఎన్ఎం పాప, గ్రామస్తులు భూపతి రెడ్డి, లచ్చిరెడ్డి, ఆశ వర్కర్లు, తదితరులు ఉన్నారు.

కేజీబీవీలో వైద్య శిబిరం

రాజంపేట,సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో బుధవారం ఎన్ఎస్‌పీఏ, ఎంహెచ్‌టీ ఆధ్వర్యంలో స్వస్థనారి స్వశక్తి పరివార్ అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా వైద్యపరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా రక్తహీనత ఉన్న పిల్లలందరికి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు.ఈ కార్యక్రమంలో వైద్యుడు హరీష్‌గౌడ్, ఏఎన్ఎం నీరజ, ఫార్మసిస్ట్ స్వప్న,ప్రిన్సిపల్ శ్రీవాణి పాల్గొన్నారు.

పర్యావరణ విద్య బ్రాండ్‌అంబాసిడర్‌గా రాంరెడ్డి

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పర్యావరణ విద్య బ్రాండ్ అంబాసిడర్‌గా కామారెడ్డి జిల్లా సైన్స్ అధికారి సిద్దిరాంరెడ్డి నియామకం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌జీసీ డైరెక్టర్ ప్రసన్నకుమార్ తనకు ఈ అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. జిల్లాలో పర్యవరణ పరిరక్షణ కోరకు విద్యార్థులలో, సమాజంలో ప్రజలకు అవగాహన కల్పించి రాబోయే తరాలకు సుస్థిర ప్రకృతిని అందించే విధంగా కృషిచేస్తానని తెలిపారు.

గన్నెర్ల మత్తడి పనులు ప్రారంభం

లింగంపేట, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భవానిపేటలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గండి పడ్డ గన్నెర్ల మత్తడి కాలువ పునరుద్దరణ పనులను ప్రారంభించినట్లు నీటి పారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

మహిళా సంఘాల అడిట్ నిర్వహణ

సదాశివనగర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇందిరా క్రాంతి పథకం గ్రామ సంఘాల అడిట్ శనివారం నుండి నిర్వహించడం జరుగుతుందని ఏపీఎం ప్రసాద్ తెలిపారు. మండలంలోని అన్నిగ్రామాల్లోని గ్రామసంఘాల 2024-25 సంవత్సరం 2వ అర్ధ సంవత్సర పుస్తకాల ఇంటర్నల్ ఆడిట్ చేయడానికి సంగారెడ్డి, కామారెడ్డి నుండి సీబీవో ఆడిటర్లు ఈ అడిట్‌ను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి డీపీఎం ఫైనాన్స్ రాజయ్య, సీసీలు, వీవోఏలు, గ్రామసంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎంఈవోకు సత్కారం

మహమ్మద్‌నగర్, సెప్టెంబరు 17: మహమ్మద్‌నగర్ మండల విద్యాధికారి అమర్‌సింగ్ ఈ నెల 30న పదవీ విరమణ పొందనున్న సందర్భంగా మండలంలోని సర్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు బుధవారం సన్మానించారు. ఎంఈవోతో పాటుగా నూతన, మాజీ పీఆర్‌టీయూ అధ్యక్షులు వెంకటరమణ, నారాయణను శాలువతో సన్మానించి జ్ఞాపిక అందజేసి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సరైన పోషణతో ఆరోగ్య నిర్మాణం

సదాశివనగర్, సెప్టెంబరు 17: చిన్నారులకు సరైనా పోషణ అందితేనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం అవుతుందని అంగన్‌వాడి సూపర్‌వైజర్ పద్మ అన్నారు. బుధవారం మూడు రోజుల శిక్షణలో బాగంగా పోషణ మాసోత్సవం నిర్వహించారు. ప్రజలకు పౌష్టికాహారం అందజేస్తూ పోషణ ఎలా నిర్వహించాలో ర్యాలీ ద్వారా తెలియజేశారు. ప్రతి అంగన్‌వాడీలో మాసోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం సరియైనా పోషణ అందిద్దాం ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కారక్రమంలో సూపర్‌వైజర్లు పద్మావతి, వనజ, జ్యోతి, అంగన్‌వాడీటీచర్లు పాల్గొన్నారు.

మల్లాయిపల్లి పాఠశాల తనిఖీ

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబరు 17: ఎల్లారెడ్డి మండల పరిధిలోని మల్లాయిపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఈవో రాజులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, తరగతి గదులు పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి వారి విద్యా సామర్థ్యాలను పరిక్షించారు. ఈ మేరకు ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యాప్రమాణాలకు అనుగుణంగా విద్యార్థులకు బోధించాలని, వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విశ్వనాథం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ జడ్పీటీసీకి సన్మానం

రామారెడ్డి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండల మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డిని బుధవారం కాంగ్రెస్ నాయకులు, యువకులు ఘనంగా సన్మానించారు. ఇటీవల అమెరికా ప్రయాణం ముగించుకొని వచ్చిన సందర్భంగా రెడ్డిపేట్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఖాసీం, కుమ్మరి శంకర్, సతీష్, ఆంజనేయులు, సురేందర్ రెడ్డి, మహేష్ రావణ్, వెంకటేష్, విజయ్, నవీన్, నరేష్, సాయిలు, ఇర్షాద్. తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ జయంతి వేడుకలను జిల్లాలోని పలు మండలాల్లో విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు ఘనంగా నిర్వహించారు. మరోవైపు పలు పార్టీల ఆధ్వర్యంలోనూ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కొన్ని చోట్ల సేవా కార్యక్రమాలు చేపట్టారు.

టీఎస్‌జీఆర్ఈఏ కార్యవర్గం ఏర్పాటు

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కర్షక్‌బీఈడీ కళాశాలలో బువారం టీఎస్‌జీఆర్ఈఏ(తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం) కామారెడ్డి యూనిట్ కార్యవర్గాన్ని ఏర్పాటుచేశారు. అధ్యక్షునిగా అర్జునరావు, కార్యదర్శిగా మహిముద్‌అలీ, కోశాధికారిగా మనోహర్‌రావు,అసోసియేట్ అధ్యక్షుడిగా రాములు,ఉపాధ్యక్షునిగా సత్యం, మహిళ ఉపాధ్యక్షురాలిగా విజయభాయి, సంయుక్త కార్యదర్శిగా శకుంతల, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నర్సయ్య, ప్రచారకార్యదర్శిగా రాజేశ్వర్, ఈసీ మెంబర్స్‌గా చక్రపాణి, నాగేశ్వర్‌రావు,శంకరయ్యలతో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో రాంమోహన్, కుసుమబాలచంద్రం, విశ్వనాథం, నిట్టువిఠల్‌రావులు పాల్గొన్నారు.

జీపీవో బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలి

భిక్కనూరు, సెప్టెంబరు 17: గ్రామ పాలన అధికారి బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని భిక్కనూరు తహసీల్దార్ సునీత అన్నారు. బుధవారం భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ గ్రామంలో గ్రామపాలన అధికారి కార్యాలయాన్ని తహసీల్దార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ జీపీవో తప్పకుండా సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బాలయ్య, సర్వేయర్ ప్రవీణ్, గ్రామపాలన అధికారి పోచయ్య, జూనియర్ అసిస్టెంట్ పరమాత్మగౌడ్, గ్రామపంచాయతీ కార్యదర్శి దయాకర్, భిక్కనూరు జీపీవోలు కాశీరాం, రమేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ, మండల కార్యవర్గంలో మార్పులు

రాజంపేట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలోని ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన 12 గ్రామాలకు సంబంధించిన కాంగ్రెస్ గ్రామ, మండల కార్యవర్గంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు మార్పులుచేసినట్లు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్రప్రణీత్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షునిగా సరిలాల్, జనరల్ సెక్రటరీగా బాలరాజు, 18 మంది కోఆర్డినేటర్‌లు, గ్రామ అధ్యక్షులుగా శశికాంత్‌రెడ్డి,రాజు,కిషన్, సాయిలు,ఇల్యానాయక్,అనిల్‌గౌడ్,రమేష్‌నాయక్,సిద్దిరాంరెడ్డి, దేవిసింగ్,ప్రవీణ్‌కుమార్, పూర్ణచందర్‌లతో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటుచేశారు.ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు సల్మాన్, మండల నాయకులు వినోద్‌మదన్, శ్యామయ్య, శివయ్య, సంజీవరెడ్డి, సహదేవ్, శ్రీధర్,స్వామియాదవ్, దేవిసింగ్, నర్సింలు, శివయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

రామారెడ్డి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండలం స్కూల్ తాండా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గంగావత్ బాలునాయక్ అన్న గంగావత్ లక్ష్మణ్ గత వారంలో స్వర్గస్తులు విషయం తెలిసిందే. బుధవారం బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామపార్టీ తరుపున నాలుగు వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సలవత్ బుచ్చిరెడ్డి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి జీవిత మార్గనిర్దేశం చేసేది గురువులే

సదాశివనగర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి జీవితంలో ఎదగడానికి విద్య బోధన సమయంలో మార్గ నిర్దేశం చేసేది గురువులేనని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి అన్నారు. శనివారం లయన్స్ క్లబ్ సదాశివనగర్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం, ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లోని ఉత్తమ ఉపాధ్యాయులుగా సేవలందిస్తున్న ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ట్రెజరర్ కోతి లింబారెడ్డి, సభ్యులు చిట్టెపు రాములు, జనగామ గంగారెడ్డి, చైట్ల శ్రీనివాస్, గాదారి రాజారెడ్డి, లక్ష్మనర్సయ్య, వడ్ల రాజేందర్, పాల్గొన్నారు.

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

నెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా ప్రజా పాలన దినోత్సవాన్ని అధికారులు, పలు పార్టీల నాయకులు ఘనంగా నిర్వహించారు. అధికారులు ప్రభుత్వ కార్యాలయాల్లో, నాయకులు ఆయా పార్టీల కార్యాలయాల వద్ద జాతీయ జెండాలు ఎగరవేశారు.



పెద్దమల్లారెడ్డి విండోలో జెండా ఎగరేస్తున్న దృశ్యం.



భిక్కనూరులో



సర్దార్ వల్లభాయ్‌పటేల్ విగ్రహం వద్ద నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే



కామారెడ్డిలో అమరవీరుల స్థూపం వద్ద



రామారెడ్డిలో జెండాను ఎగురవేసిన ఎంపీడీవో నాగేశ్వర్ గుప్తా

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- కొత్తలోక
ప్రియ 35- లిటిల్ హార్ట్స్
దర్శన్- మిరాయి

బాన్సువాడ

మహేశ్వరి	మిరాయి
వెంకటేశ్వర	లిటిల్ హార్ట్స్

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.160	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230